

# వడ్డాణం

**-శారదా అశోక వర్ధన్**

**బా**పు బొమ్మన్నా, బాలమురళి కచ్చేరీ అన్నా భానుమతి కథనం అన్నా, శ్రీశ్రీ కవిత్వమన్నా, సి.నా.రె. ఉపన్యాసమన్నా చెవి కోసుకుంటాను. అలాగే ఉగాది పండగన్నా అంత ఇష్టం. ఉగాది పచ్చడి పుల్లపుల్లగా, తియ్యతియ్యగా, చేదుచేదుగా ఒకరకమైన కమ్మని రుచి నాకు నోరూరిస్తుంది. పైగా అదేమిటో ఆ పచ్చడి తరచూ చెయ్యకుండా ఒక్క ఉగాదికే చెయ్యడం వల్లనేమో ఉగాది కోసం ఎదురు చూడడం జరుగుతుంది. రెండో కారణం, అప్పుడు నాకు ఎనిమిదేళ్లుంటాయేమో! ఉగాదినాడు నాన్న అమ్మ కోసం రాళ్లు పొదిగిన వడ్డాణం చేయించి పట్టుకొచ్చారు. ఆ జిగేలుమనే వడ్డాణం, అమ్మ మొహంలో మెరిసిన ఆనంద రేఖ, ఒకే కాంతితో ఉన్నట్టనిపించింది.

'అమ్మా.. నాకూ వడ్డాణం చేయించవే" అన్నాను.

"నీ పెళ్లికి చేయిస్తాంలే" అంది అమ్మ నవ్వుతూ.

"అబ్బ! అన్ని రోజులే" అన్నాను.

"అయితే వెంటనే పెళ్లి చేసెయ్యమంటావా?" నవ్వుతూనే అంది.

"ఛీ..." అన్నాను.

అలా ఆరోజు అమ్మ ఒయ్యారంగా వడ్డాణం పెట్టుకుని, బొబ్బట్లు, పులిహోరా చేసి, అందరికీ వడ్డిస్తూంటే, దేవతలనీ రాక్షసులనీ కూర్చోబెట్టి అమృతం వడ్డిస్తున్న మోహినిలా అనిపించింది. ఆ వడ్డాణాన్ని అమ్మ దసరా నవరాత్రులూ, ఉగాది పండగకి మాత్రమే పెట్టుకునేది. కొంచెం కొంచెం ఎదుగుతూన్న కొద్దీ నాకు తెలిసిందేమిటంటే, నాన్న ఆ వడ్డాణం చేయించడానికి చిట్టీలు కొంత, అప్పు చేసి కొంత డబ్బు పోగు చేశారట, అమ్మ సరదా తీర్చడానికి. ఆ అప్పులు తీర్చుకునే లోపలే అన్నయ్య మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలనీ, పుస్తకాలనీ, తమ్ముడు ఇంజనీరింగ్ కోర్సులనీ, ఇలా ఏవేవో ఖర్చులు పెరిగిపోయాయి. మండిపోయే ధరలకి తోడుగా. దానికితోడు బామ్మ జబ్బుతో మంచం పడితే మందులకీ, ప్రాణం పోయాక కర్మలకీ విందులకీ ఒక చిన్న పెళ్లి ఖర్చులా జరిగిపోయింది. నాన్న నెల జీతం రానురాను ఇంటి ఖర్చులకి సరిపోయేది కాదు. అమ్మ నగలు ఒక్కొక్కటీ అదృశ్యమవుతూ వొచ్చాయి. చివరగా వడ్డాణమూ అంతర్ధానమయిపోయింది.

అంతలోనే చెల్లాయి కూడా కాలేజీ చదువుకి అందుకుంది. దాంతో నా పెళ్లి చెయ్యాలి అన్న బెంగ నాన్నకి పెద్ద సమస్యై కూర్చుంది, అమ్మని దిగులుతో నింపేసింది.

'ఉద్యోగం చేస్తానంటే' చాల్లే ఊరుకో. ఉద్యోగం చేసి మమ్మల్ని పోషిస్తావా? ఆ పని చెయ్యడానికి నీ అన్నయ్యా, తమ్ముడూ వున్నారు. వాళ్ల చదువులయి సంపాదనలోకి దిగితే ఇంక మాకేం దిగులూ అనేది అమ్మ. ఇలా ఒక్కసారిగా శ్రావణ మేఘాలు కమ్మిన ఆకాశంలా ఇల్లు మారిపోయింది.

ఒకరోజు పెట్టే బేడాతో మా మామయ్య దిగాడు మద్రాస్ నుంచి. మద్రాసు మామయ్య ఒక సంబంధం తెచ్చాడు. 'మంచి సంబంధం. కట్నాలు అక్కర్లేదు. పిల్లాడు అన్నపూర్ణా ఆయిల్ మిల్స్‌లో సేల్స్ ఆఫీసరు. లాంఛనాలతో సంప్రదాయంగా పెళ్లి చేస్తే చాలు. జేబులోంచి ఫోటో తీసి చూపించాడు. పిల్లాడు నాగేశ్వరరావులా వున్నాడు అంది అమ్మ.

'ఎలా? దేవదాసు లాగానా? దసరా బుల్లోడు

# విష్ణు మాయ

**ఓ** భక్తురాలు వరలక్ష్మీ వ్రతం చేసి, 'తల్లీ! నా భర్త చేతికి ఎముక లేకుండా, అడిగిందే తడవు అయిన వారికీ, కాని వారికీ సహాయం చేస్తున్నాడు. వచ్చే సంపాదనంతా దానధర్మాలకే ఖర్చయిపోతోంటే ఇల్లు గడవడం కష్టమైపోతోంది. అందుకని మాకు మరిన్ని భోగభాగ్యాలు కలిగించి ఆదుకోవమ్మా!' అని ప్రార్థించింది.

'ఈ భక్తురాలి విషయం ఏం చేద్దామ'న్నట్లుగా లక్ష్మీదేవి విష్ణుమూర్తి వైపు చూసింది. 'వ్రత కథ ప్రకారం నువ్వు ముసలి ముత్తయిదువ రూపంలో వెళ్లి, ఈ రాత్రికి ఆమె ఆతిథ్యం స్వీకరించాలి. ఆమె ఇంటి మూలల్లో సువర్ణ రాశులు కురిపించాలి. ఇవిగో, ఈ నాలుగు బియ్యపు గింజల్నీ తీసుకువెళ్లి, ఆమెకు తెలియకుండా ఆమె వండే పాయసంలో పడవెయ్యి' అని ఓ నాలుగు బియ్యపు గింజల్ని లక్ష్మి చేతిలో ఉంచాడు విష్ణువు.

లక్ష్మీదేవి ఆ విధంగానే చేసి, మర్నాడు ఉదయం భక్తురాలిని- 'ఇష్ట కామనా సిద్ధిరస్తు!' అని దీవించి వైకుంఠానికి తిరిగి వెళ్లింది. భక్తురాలి ఇంట్లో సువర్ణ వర్షం కురిపించడం మరిచిపోయింది.

అనతి కాలంలోనే భక్తురాలికి 'నేనూ, నా భర్తా, నా పిల్లలూ, నా సంసారమూ' అన్న భావన మనసులో బలంగా నాటుకొంది. భర్త చేతి ఎముక గట్టిపడింది. పిడికిలి బిగిసింది. ఆ తర్వాత సంసారానికేవిధమైన ఇబ్బందీ కలగలేదు.

'నాథా జరిగిందేమిటి?!' లక్ష్మీదేవి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

'యుగ ధర్మానికి విరుద్ధంగా దారితప్పి నడుస్తున్న వారి మనసుల్లో కలియుగ ధర్మ బీజాల్ని నాటానంతే!' అన్నాడు విష్ణువు మందహాసంతో.

భక్తురాలు పెట్టిన పాయసం ఆరగించిన లక్ష్మీదేవి కూడా వరప్రదానాలు చెయ్యడం మరిచిపోయింది.

(నీతి: ఋణాలివ్వవలసిన కలి కాలంలో దానాలు చెయ్యకూడదు!)

**- పి.వి.రమణారావు**

లాగానా?' అంది చెల్లి. మొత్తానికి త్వరలోనే పెళ్లిచూపులు, వెంటనే ముహూర్తం, గబగబానే జరిగిపోయాయి. 'అత్తవారికీ ఆడబిడ్డలకీ పట్టు చీరలూ, మామగారికీ వారి అల్లుళ్లిద్దరికీ బట్టలూ, శ్రీవారికి అతని నక్షత్ర ప్రకారం కెంపుల ఉంగరం, బట్టలూ, సూటూ వగైరాలు. పెళ్లికూతురికి పెట్టే నగల లిస్టు కూడా వాళ్లే చెప్పారు. అందులో వడ్డాణం లేదు. నన్నడిగితే అవన్నీ మానేసి ఒక్క వడ్డాణమే అడిగి వుండేదాన్ని, నాకా స్వాతంత్ర్యం లేదు.

'కట్నం లేదు. కేవలం ఇవ్వే కదా' అని మురిసిపోయిన అమ్మా నాన్నా లెక్కలు చూసుకున్నాక, అంతకాడికే వొచ్చిందని దిగాలుపడ్డారు, అవ్వ పేరే ముసలమ్మ అన్నట్టు. నా పెళ్లి తరవాత నాన్న గారి అప్పులు మరో రెండు లకారాలు పెరిగాయి. కట్నం తీసుకోని పెళ్లి అని ఎగిరి గంతేసి లంకె బిందెలు దొరికినంతగా సంతోషపడ్డ అమ్మ, నాన్న గారి రిటైర్మెంటు గ్రాట్యుటీ అంతా అప్పులకే సరిపోయిందన్న వార్త విని గుండె దడ ఆపుకోవడానికి పిచ్చిదానిలా గుండెకి చేతులడ్డం పెట్టుకుంది.

పెళ్లి మార్చిలో జరగడం వల్ల, అల్లుణ్ణీ వాళ్ళ వాళ్లందరినీ పిలిచే మొదటి పండుగ ఉగాదే అయింది. మళ్లీ అత్తగారికీ ఆడపడుచులకీ చీరలూ, మామగారికీ, బావగార్లకీ బట్టలు, శ్రీవారికి బట్టలూ ఈసారి పచ్చల ఉంగరం (అంతా అత్తగారు వొద్దువొద్దంటూనే చిరునవ్వుతో అమ్మకిచ్చిన లిస్టు ప్రకారమే). అంతా మామూలుగానే జరిగిపోయింది. అమ్మ మెళ్లో సన్నని మంగళసూత్రం గొలుసు తప్ప, మరేం లేకపోయినా, నా కళ్లకి మాత్రం నా చిన్నప్పటి ఆమె మోహినీ రూపమే కనిపించేది, ఫోటోలా! 'నీకెంతిష్టమో వడ్డాణమంటే! అన్న మాట నిలబెట్టుకోలేకపోయాను. పెళ్లికి చేయించలేకపోయాను. ప్రతీసారి ముఖ్యంగా ఉగాదికి పంచాంగ శ్రవణంలా మా మధ్య జరిగే సంభాషణ ఇది. నాన్న ఇవేవీ వినిపించని వాడిలా మౌనంగా వుండిపోయేవారు. ఆ మౌనం కొన్నాళ్లకే శాశ్వతంగా వుండిపోయింది. ఆయన హాయిగా బామ్మ దగ్గరి కెళ్లిపోయారు.

మా అత్త గారికీ వుండేది వడ్డాణం. రాళ్లు పొదిగినది కాకపోయినా, మువ్వల వడ్డాణం. ఆమె ఎప్పుడూ పెట్టుకోదు. కూతుళ్లని పెట్టుకోమని బతిమిలాడేది. 'వడ్డాణమూ, కడియాలూ పెట్టుకోమంటావేమిటమ్మా నాంచారమ్మలా మాకొద్దు. చెరిపించేసి ఇంకేమైనా చేయించెయ్' అనేవారు వాళ్లు. అలా అన్నప్పుడల్లా 'నేను పెట్టుకుంటానత్తయ్యా' అని అడగాలని అనుకున్నా అక్షరాలు గొంతుకడ్డుపడి నాలుక దాటేవి కావు. అయినా ఒక ఉగాదికి సిగ్గువిడిచి అడిగాను. 'అదేం కోరికే! అది మోటు నగటగా! పిల్లలిద్దరూ పెట్టుకోమని పోరుపెట్టినా ఒద్దంటున్నారు. దాన్ని చెరిపించేస్తాను" అన్నారామె. 'పోనీ ఈ ఒక్కరోజైనా పెట్టుకో' అని అనకుండా.

ఆ తరవాత ఒకసారి మా శ్రీవారు మాంచి మూడ్‌లో వుండి 'ఒరేయ్ నీకేం కావాల్రా ఉగాదికి. మాంచి పట్టుచీర కొంటాను' అన్నారు. మావారికి నామీద మరీ ప్రేమ ఒచ్చేసినప్పుడు అలా 'ఒరేయ్' అని పిలుస్తారు. 'నాకు పట్టు చీరలూ ఏవీ ఒద్దుగానీ', వడ్డాణం చేయించి పెట్టండి ప్లీజ్' అన్నాను. నా కోరిక విని విస్తుపోయారాయన. 'ఈరోజుల్లో వడ్డాణాలెవరూ పెట్టుకోవట్లేదట కదా. సరే ఎటూ మా అమ్మదుంది. నీకియ్యమని చెప్తాను' అన్నారు. ఆమె ఎటూ ఇవ్వదని నాకు తెలిసినా మా వారికి వాళ్లమ్మ మీద వున్న నమ్మకానికి ఆశ్చర్యపోతూ 'సరే' అన్నాను.

"ఒరేయ్! అది నా పెళ్లిలో మా పుట్టింటి వాళ్లు పెట్టేరు. స్త్రీధనం కింద. అది ఆడ పిల్లలకి పోతుంది కాని, కోడలికెలా వొస్తుంది?" అంటూ 'లా' పాయింట్ మాట్లాడే సరికి మావారు అవాక్కయి, తన ఓటమిని ఒప్పుకోక మరో రకంగా హైలైట్ చేస్తూ, 'ఒరేయ్! అది బ్యాంకులో లాకర్లో వుందటరా' అన్నారు ముక్తసరిగా. కాస్సేపాగి నాకు విరక్తి కలగాలనేమో 'అయినా అదేం కోరికరా... ఆ కాలంలో ప్లీడర్లు ధోవతి మీద వెడల్పాటి తోలు బెల్టు కట్టుకుని కోర్టుల కెళ్లినట్టు, చీరమీద ఈ బంగారు బెల్టెందుకూ?" అన్నారు.

'చూడండీ! నాకా బెల్టంటే ఇష్టం' అన్నాను.

'సరే నెక్స్ట్ ఉగాదికి చేయిస్తా' అన్నారు.

నెక్స్ట్ ఉగాది కూడా వొచ్చింది. మావారు నాకు కష్టపడి ఇచ్చింది ఏడు నెలల గర్భం. ఆయనే అన్నారు. 'ఒరేయ్! ఈ సమయంలో వడ్డాణం ఎలా పెట్టుకుంటావ్? పైగా కొలతలు కూడా సరిపోవు అని.' సరే! కొంత కాలానికి మా ఆమని పుట్టింది. ఆమని పుట్టాక నాకు బాగా ఒళ్లొచ్చేసింది. మళ్లీ ఉగాదికి మావారి డైలాగు 'ఒరేయ్! ముందు సన్నబడరా, వడ్డాణం చేయిస్తాను' అని.

మరో రెండు ఉగాదులు దొర్లిపోయాయి. మళ్లీ పరిస్థితి మామూలే. ఆసారి ఉగాదికి అభిషేక్ పుట్టి పదిహేను రోజులయింది. వడ్డాణం ప్రసక్తే లేదు.

ఒకసారి పెరిగి ఇక దిగని ధరల్లా నా లావు తగ్గలేదు. పైపెచ్చు కొంచెం పెరిగిందేమో కూడా. నా శరీరంతో పాటు బంగారం ధరలూ చుక్కలని తాకుతున్నాయి.

'ఒరేయ్! నీకిప్పుడు వడ్డాణం చేయించాలంటే ఎన్ని కిలోల బంగారం కావాలో తెలీదు. ఎలా?' అనేవారు శ్రీవారు వ్యంగ్యంగా. నేను కోపంతో మూతి ముడుచుకునేదాన్ని. "కోపమెందుకూ? కొంచెం సన్నబడూ... బంగారం ధర కూడా కొంచెం తగ్గనీ..." అనేవారాయన లాలనగా! నేను సన్నబడలేదు... బంగారం ధరా తగ్గలేదు – రెండూ అసాధ్యాలే.

ఎన్ని ఉగాదులు గడిచిపోయాయో! నాకు తెలీకుండానే... ఆమనీ, అభిషేకూ... పెరుగుతున్నారు. వాళ్ల స్కూళ్ల ఫీజులే వేలకి వేలవుతున్నాయి. క్రమేణా వడ్డాణం నా మనసులోంచి మసకబారిపోయింది. కానీ ఉగాదినాడు మాత్రం తప్పక గుర్తుకొస్తుంది వడ్డాణం!... మోహిని లాంటి ఆనాటి అమ్మ రూపంలో!

అందుకే నాకు ఉగాదంటే, తీరని కోరికలోని చేదుతనం, అమ్మ రూపంలోని కమ్మదనం కలబోసుకుని ఉగాది పచ్చడిలా నోరూరిస్తుంది.

ఆమనికి వడ్డాణం చేయిస్తానన్నాను. చిన్న పిల్ల వడ్డాణానికి ఎక్కువ బంగారం పట్టదని.

'నాకొద్దమ్మా ఆ గోల్డు బెల్టు' అంది.

మావారు పగలబడి నవ్వారు.

మావారి నవ్వు ఎగతాళిగా అనిపించి కోపమొచ్చినా ఆమని మాటలకి నవ్వొచ్చి నవ్వేశాను.

హాయిగా ప్రతీ ఉగాదికీ అమ్మ రూపు తలుచుకుని ఆనందిస్తాను. ఇప్పటికీ అందుకే ఉగాదంటే నాకు అమ్మంత ఇష్టం!

✿

## కవిత్వపు గది

నిద్ర మరణం కానట్టే
విరామమూ విరమణ కాదు
అస్త్రసన్యాసం అంతకన్నా కాదు
సమస్త శారీరక బడలికా వటవృక్షాల్ని
కూల్చేందుకు
మానసిక పెను మంచు తుఫానుల్ని
కరిగించేందుకు
విత్తనం
మట్టి నుండి జీవశక్తిని పీల్చుకున్నట్టు
నిద్రలో మనిషి
తనను తాను కూడగట్టుకుంటాడు
విరామమూ అంతే–
జీవితమైనా...
ప్రయాణమైనా...
కవిత్వమైనా...
ఎక్కడో ఓ అక్కడ
ఒకింతసేపు ఆగి
నడిచివొచ్చిన దారిని పరికించి
కాసేపు వొత్తిగిల్లి
మళ్లీ నడక మొదలెట్టక తప్పదు
నడిచి నడిచి నత్త దేహాన్ని లోపలికి
తీసుకుంటుంది
అంతమాత్రాన నిర్జీవి కాదు
వేళ్లు కొంకర్లు పోయే శిశిరంలో
మనిషి కన్నీళ్లు రాల్చుకున్నట్టు
చెట్టు ఆకుల్ని రాల్చుకుంటుంది
అంతమాత్రాన పత్రహరితాన్ని పారేసుకున్నట్టు
కాదు
నట్టనడి ఎండల్లో
గులకరాళ్లు గొంతుకు అడ్డంబడి
సెలయేరు
ఇసుక నాలుకను బయటకు పెడుతుంది
అంతమాత్రాన నీటి గుణం ఆవిరైపోయినట్టు
కాదు
వాన చినుకు రహస్య పిలుపుతో
పచ్చని తలపాగా ధరించి
పైకొచ్చేంత వరకూ
తాను భూమిలో దాగున్నానని
విత్తనం ఎవరికీ చెప్పదు
పోగొట్టుకున్న
కవిత్వపు గది తాళంచెవి చాన్నాళ్లకు
దొరికింది
ఇక
తలుపులు తెరవడమే తరువాయి

– శిఖామణి